క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముడుమాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సి.బెళగల్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ తిమ్మారెడ్డి పరిశీలించారు. శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి ముడుమాల, ఇనగండ్ల, కొండాపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి వసతులు, సౌకర్యాలు, సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు మరమ్మతులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

సి.బెళగల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. శనివారం సి.బెళగల్ చెరువు దగ్గరున్న తాగునీటి బోరు మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యచరణతో పనులు చేస్తున్నట్లు చెప్పారు. నదీతీర గ్రామాల్లో నీటి వనరులను పునరుద్ధరించి గ్రామాలకు నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

6న సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ఏఓ విజయసింహారెడ్డి తెలిపారు. ఎంపీపీ సునీత అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులందరూ హాజరుకావాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండలానికి మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వలంటీర్ల ద్వారా వేగవంతం చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాలకు 14,937 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామ వలంటీర్లకు అందజేసి వారి ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. బుధవారం నుంచి కార్డుల పంపిణీ ప్రారంభం కాగా పలు సచివాలయాల పరిధిలో పంపిణీ శాతం తక్కువగా ఉండడంతో ఎంపీడీఓ వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 3వ తేదీ నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ దిల్షాద్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 21వ తేదీ రాత పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు apms. apcfss. in వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 16 మంది గైర్హాజరు

కోడుమూరు రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. కోడుమూరులోని రెండు పరీక్షా కేంద్రాల్లో సెకండ్ లాగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 149 మంది విద్యార్థులకు గాను 8 మంది, మోడల్ స్కూల్‌లో 179 మంది విద్యార్థులకు గాను 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు విజయభాస్కర్, గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.165 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలు.. చకచక నిర్మాణాలు

పేదలందరికీ సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఉచితంగా పట్టా ఇచ్చి ఇళ్లు మంజూరు చేశారు. నిర్మాణం మొదలు పెట్టినప్పటి నుంచి అండగా నిలిచారు. రాయితీపై నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని అందించారు. దీంతో చాలా మంది పేదలు గృహాన్ని నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. మరికొందరు చకచక నిర్మాణ పనులు చేస్తున్నారు.

- ప్రభుత్వ సహకారంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం
- చాలా వరకు పూర్తి..మరికొన్ని వివిధ దశల్లో పనులు
- ఊర్లను తలపిస్తున్న కాలనీలు
- పేదల సొంతింటి కల సాకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ పట్టాలు అందించి ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహిస్తోంది. ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా గృహాలు కట్టుకునేలా సహాయ సహకారాలు అందిస్తోంది. రాయితీపై సామగ్రిని అందజేసింది. పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, ఓర్వకల్లు, కాలనీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కాలనీలు కొత్త ఊర్లుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారు.



ఊరిని తలపిస్తున్న పాణ్యం జగనన్న కాలనీ



ఓర్వకల్లు జగనన్నకాలనీ ముఖద్వారం



పాణ్యంలో పూర్తయిన ఇల్లు

పాణ్యం నియోజకవర్గంలో జగనన్న కాలనీ ఇళ్ల వివరాలు

మండలం	పూర్తయినవి	స్లాబ్ లెవెల్	ఆర్‌సీ లెవెల్	బేస్ లెవెల్	మొదలుకానివి
పాణ్యం	704	36	23	365	233
గడివేముల	307	47	32	59	260
ఓర్వకల్లు	900	60	50	748	16
కల్లూరు	596	17	9	158	149
మొత్తం	2507	160	114	1330	658

మౌలిక వసతుల కల్పన

జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వగానే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. రోడ్లు నిర్మించారు. లేఅవుట్‌లో ప్రతి కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా కాలనీలో బోర్లు వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. వీధిలైట్లు అమర్చారు. గృహ నిర్మాణాలు పూర్తి కాగానే లబ్ధిదారులకు విద్యుత్ వైర్, మీటర్, బోర్డు ఉచితంగా అందిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి మెటీరియల్, సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నారు. సొంతింటి కల నేరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముడి సరుకుతో ముందడుగు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఇళ్ల నిర్మాణాల కోసం ఒక్కో లబ్ధిదారుకు 100 బస్తాల సిమెంట్, 485 కేజీల ఐరన్, 2 పెద్దవి, 2 చిన్నవి మొత్తం నాలుగు కిటికీలు, డోర్ ఫ్రేమ్ డబుల్, సింగల్, 20 టన్నుల ఇసుక, రూ. 5700పైగా విలువ గల ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు టాయిలెట్ బేసిన్ అందిస్తున్నారు.

అద్దె బాధలు తప్పాయి



సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీశాం. వచ్చే ఆదాయంలో రూ.3,500 ఇద్దెకే పోయేది. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం కోసం అప్‌లై చేసిన వెంటనే మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చే బిల్లులకు తోడు దాచుకున్న నగదుతో ఇల్లు కట్టుకున్నాం. కాలనీలో విద్యుత్, మంచినీరు, రోడ్డు సౌకర్యం కల్పించారు. గత నెల క్రితం గృహ ప్రవేశం చేశాం. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. –దొల్లు లలితా, పాణ్యం

కల నెరవేరింది



చాలా కాలం సొంతిల్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సొంతిల్లు ఉంటే బాగుంటుందని కలలు కన్నాం. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దరఖాస్తు చేసుకున్నాం. కొద్ది రోజులకు మంజూరు చేశారు. ఇల్లు కట్టుకోవడానికి సమగ్రి అందించి ప్రోత్సహించారు.ప్రస్తుతం ఇంటి నిర్మాణం జరుగుతోంది. మరో కొద్దిరోజుల్లో సొంతింటి కల నెరవేరుతుంది. ఆయన చేసిన మేలు మరిచిపోలేం. ఆయనకు రుణపడి ఉంటాం. –నజీరూన్ గడివేముల

సకాలంలో బిల్లులు



ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వెంటనే దశల వారీగా బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉంచాం. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. కాలనీలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు నిర్మాణాలను పరిశీలిస్తున్నూ లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్నాం. ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నాం. –సుబ్బారెడ్డి హౌసింగ్ డీఈఈ

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

పాణ్యం: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పామ్ ఆయిల్ సాగుతో అధిక లాభాలు



బురాన్‌దొడ్డిలో పామ్‌ఆయిల్ మొక్కలను నాటుతున్న అధికారులు

సి.బెళగల్: పామ్ ఆయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని, పంట సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన అధికారి డాక్టర్ రామకృష్ణరావు అన్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్ పామ్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామంలో శనివారం పామ్ ఆయిల్ పంట సాగుకు అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి ఆరు ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ, పతాంజలి ఫుడ్స్ సంస్థ అధికారులు రైతును అభినందించారు. సాగులో యాజమాన్య పద్ధతులు, మెళకువలు, నీటి, ఎరువుల యాజమన్య పద్ధతులు, ఉపయోగాలు, లాభాలను వివరించారు. రైతులు ముందుకు వస్తే రాయితీపై సాగుచేసుకోవచ్చని, వివరాలకు ఆర్బీకేలలో సంప్రదించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏరువేక కేంద్రం ప్రధాన శాస్త్రవేత, పతాంజలి ఫుడ్స్ జనరల్ మేనేజర్ రమణ, అసోషియేట్ జనరల్ మేనేజర్ రామకృష్ణయ్య, రామాంజనేయులు, జిల్లా మేనేజర్ మహాదేవయ్య, ఫీల్డ్ అధికారి సతీష్, వీఏఏ మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



కల్లూరు: వైద్య సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ



పాణ్యం: అలమూరులో..



గూడూరులో..



కోడుమూరు: పల్స్ పోలియోపై ర్యాలీ

- నేడు పల్స్‌పోలియో

కోడుమూరు రూరల్: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు చాలని కోడుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న అన్నారు. ఆదివారం జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఆరోగ్య సిబ్బంది హైస్కూల్ విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మండలంలో 5,010 మంది పిల్లలు ఉన్నారని, వీరందరికి పోలియో చుక్కలు వేసేందుకు 32 బూతులతో పాటు కోడుమూరు కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ సెంటర్లలోనూ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, హెచ్‌ఎం తైమూర్ బాషా పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

సి.బెళగల్: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. మండలంలో 5,530 మంది చిన్నారులను గుర్తించామని..వారికి 26 బూత్‌లు, మూడు కూడళ్ల, ఒక మొబైల్ టీమ్ ద్వారా పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

విజయవంతం చేయండి

గూడూరు: మండలంలోని ఐదేళ్లలోపు పిల్లలకు వంద శాతం పోలియో చుక్కలు వేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష్న అన్నారు. సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన

కల్లూరు: పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లు రఘు, నవీన్ అన్నారు. ఉలిందకొండ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో చుక్కలు వేయించుకున్న పిల్లలకు అంగవైకల్యం రాదన్నారు. ఎంపిహెచ్‌ఈఓ విజయ్ కుమార్, సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

పాణ్యంలో 6,637 మంది పిల్లలు

పాణ్యం: మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 6,637 మంది ఉన్నారని.. వీరందరికీ చుక్కలు వేయించాలని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్ అన్నారు. ఇందు కోసం 31 బూత్‌లు, 130మంది సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

డయాలసిస్ పేషెంట్‌కు పింఛన్ మంజూరు



ఈశ్వరమ్మకు రూ.10వేల పింఛన్ అందజేత

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన రాముడు భార్య ఈశ్వరమ్మ ఈ ఏడాది జనవరి నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. వారానికి రెండుసార్లు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటోంది. అయితే వారానికి రెండు సార్లు కర్నూలు వెళ్లి వచ్చేందుకు రవాణా, ఇతర ఖర్చులు భరించలేని స్థితికి చేరుకుంది. ఈశ్వరమ్మ పరిస్థితిపై ప్రభుత్వాసుపత్రి అధికారులు డయాలసిస్ పెన్షన్‌కు రెకమెండ్ చేశారు. మార్చి నెల నుంచి రూ.10వేల పింఛన్ మంజూరైంది. దీంతో లద్దగిరి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్రుడు శనివారం ఈశ్వరమ్మ ఇంటికి వెళ్లి రూ.10 వేలను అందజేశారు. కష్టకాలంలో తమకు రూ.10 వేల పింఛన్ ఇచ్చి జగనన్న దేవుడిలా ఆదుకున్నాడంటూ ఈశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

గడివేముల: మండలంలో పింఛన్ల పంపిణీ శనివారం కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వేలిముద్రలు సేకరించి పింఛన్లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



మాట్లాడుతున్న బీవై రామయ్య

గూడూరు: 'జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని.. ఇందు కోసం ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని అస్లామ్ పత్తి మిల్లు ఆవరణలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రామయ్యతో పాటు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. జగనన్నను సీఎంగా చేసుకోవడం కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం కింద ప్రతి ఇంటికి ఐదు సార్లు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించాలని తెలిపారు. జగనన్న మళ్లీ గెలిస్తే మరెన్నో సంక్షేమ పథకాలు వస్తాయని ఓటర్లకు చెప్పి వారి మద్దతు కోరాలన్నారు. కుడా చైర్మన్ మాట్లాడుతూ.. కోడుమూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని మరోసారి నిరూపించాలన్నారు. గతంలో కంటే అధిక మెజార్టీ సాధించాలన్నారు. అందుకు ప్రతి కార్యకర్త రానున్న 45 రోజులు కష్టపడాలని సూచించారు. ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుందామని కోరారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, మండల సచివాలయ కన్వీనర్ చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పెంచికలపాడు ఎల్లనాగిరెడ్డి, నాయకులు రాముడు, మక్బుల్, కృష్ణారెడ్డి, డిష్ నాగరాజు, బూడిదపాడు సుబ్బన్న, నాగరాజు, నరసింహారెడ్డి, జగదీశ్వరరెడ్డి, సుంకన్న, శ్రీను, కౌన్సిలర్లు కిషోర్, మద్ది, ఖలీల్, జానీ, సత్యాలు, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి

కర్నూలు (టౌన్): పోలింగ్ సమయంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి భార్గవ్ తేజ ఆదేశించారు. శనివారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో ఎలక్ట్రోల్ ఆఫీసర్లు, సెక్టోరల్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారుల ద్వారా పోలింగ్ స్టేషన్ల వారీగా మ్యాపింగ్ చేయాలన్నారు. గత ఎన్నికల్లో సమస్యలు తలెత్తిన పోలింగ్ స్టేషన్లను పరిగణలోకి తీసుకొని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదాం



సి.బెళగల్: బ్రాహ్మణదొడ్డిలో మాట్లాడుతున్న సోమశేఖర్‌రెడ్డి

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం, కాల్వ సచివాలయాల పరిధిలో 'మేము సిద్ధం.. మా బూత్‌లు సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, బూత్‌స్థాయి కమిటీ సభ్యులు వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ చిన్న అయ్యన్న, కాల్వ చిన్న వెంకటేశ్వర్లు, కాటినేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

చేసిన మేలును తెలియజేయండి

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును ప్రజలందరికీ తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడి, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి అన్నారు. శనివారం బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాల్లో మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజెప్పాలన్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపేలా చూడాలని సూచించారు. బ్రాహ్మణదొడ్డి సర్పంచ్ దస్తగిరి, సచివాలయ కన్వీనర్లు రాజశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర, రామాంజనేయులు, రుక్మాంద, రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు : కర్నూలు రోజా వీధికి చెందిన గరిక సాయికుమార్ (20) హత్య కేసులో నిందితులు సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన మల్లెపోగు మధు, షేక్ నిసార్ అహ్మద్, బుధవారపేటకు చెందిన గాజుల జగదీష్‌లను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. సాయికుమార్ తన తల్లిదండ్రులు చనిపోవడంతో తమ్ముడు కుమార్‌తో కలసి రోజా వీధిలో నివాసముంటూ ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. గత నెల 25వ తేదీ రాత్రి వరుసకు బావ అయిన గురుమూర్తితో కలిసి పరోటా తినేందుకు ఆటోలో కోట్ల సర్కిల్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో నిందితులు మరో ఆటోలో వారిని అనుసరిస్తూ హారన్లు గట్టిగా కొడుతూ చిరైత్తించడంతో ఆపి గొడవ పడి వెళ్లిపోయారు. చిదంబర రావు వీధిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం వద్దకు ఇరువర్గాల వారు చేరుకుని మరోసారి గొడవ పడి సాయికుమార్‌ను కత్తితో గొంతు కోశారు. అడ్డుకునే యత్నం చేసిన గురుమూర్తి కూడా దాడిలో గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపే సాయికుమార్ మృతిచెందాడు. గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని పక్కా ఆధారాలతో శనివారం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఒకటో పట్టణ సీఐ వై.పవన్‌కుమార్ తెలిపారు.